క్లుప్తంగా

క్యాలెండర్ ఆవిష్కరణ



క్యాలెండర్‌ను ఆవిష్కరిస్తున్న టీటీడీ చైర్మన్ వైవీ సుబ్బారెడ్డి

పిఠాపురం: తాను రూపొందించిన 2022 దత్త క్యాలెండర్‌ను టీటీడీ చైర్మన్ వైవీ సుబ్బారెడ్డి తిరుపతిలో శుక్రవారం ఆవిష్కరించినట్లు పిఠాపురానికి చెందిన దత్త భక్తుడు లక్ష్మీనారాయణ తెలిపారు.

విద్యార్థుల ఆరోగ్యంపై శ్రద్ధ

సామర్లకోట: ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటున్నట్లు మండల విద్యాశాఖాధికారి వై.శివరామకృష్ణయ్య తెలిపారు. పౌష్టికాహారం అందించడంలో భాగంగా ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి వారంలో మూడు రోజుల పాటు విద్యార్థులకు రాగి జావ ఇవ్వాలని ఆదేశాలు ఇచ్చారని చెప్పారు. ఫిబ్రవరి ఒకటి నుంచి ఈ పథకం అమలవుతుందని అన్నారు.

వసతులు మెరుగుపర్చండి



ఎమ్మెల్యే దొరబాబుకు వినతిపత్రం అందజేసిన ఎస్‌ఎఫ్‌ఐ నాయకులు

పిఠాపురం: ప్రభుత్వ వసతి గృహాల్లో వసతులు మెరుగుపర్చాలని కోరుతూ ఎస్‌ఎఫ్‌ఐ నాయకులు ఎమ్మెల్యే పెండెం దొరబాబుకు శుక్రవారం వినతిపత్రం అందజేశారు. ఎస్‌ఎఫ్‌ఐ నాయకులు సిద్దు, శ్రీకాంత్, లోవరాజు, శ్రీరామ్, చిన్ని, ప్రసన్న తదితరుల వినతి మేరకు స్పందించిన ఎమ్మెల్యే ఈ విషయాన్ని ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్తానని తెలిపారు.

సమస్యలు పరిష్కరించాలని వినతి

సామర్లకోట: గ్రామ రెవెన్యూ సహాయకుల నుంచి గ్రామ రెవెన్యూ అధికారులుగా పదోన్నతి పొందిన తమ సమస్యలు పరిష్కరించాలని కోరుతూ రాష్ట్ర హౌసింగ్ కార్పొరేషన్ చైర్మన్ దవులూరి దొరబాబుకు వినతి పత్రం సమర్పించారు. ప్రభుత్వ నిబంధనల ప్రకారం ఉన్న ప్రొబేషన్ కాలం ముగించి సర్వీసు రెగ్యులర్ చేయడానికి కావాల్సిన అన్ని టెస్టులు పూర్తయినా రావాల్సిన సదుపాయాలు అందించడానికి అధికారులు చర్యలు తీసుకోవడం లేదని గ్రేడ్–2 వీఆర్వోల సంఘ నాయకులు కె.శ్రీనివాసు, కేవీ సత్యనారాయణ తెలిపారు. వీఆర్వోల సమస్యలను ముఖ్యమంత్రి దృష్టికి తీసుకు వెళతానని దొరబాబు హామీ ఇచ్చారు.

పిడింగొయ్యికి వెళ్లి.. పింఛన్ ఇచ్చి..



సత్యవతికి పింఛను సొమ్ము అందజేస్తున్న వెల్ఫేర్ కార్యదర్శి, కౌన్సిలర్

సామర్లకోట: స్థానిక సంగీతరావుపేటకు చెందిన బోను సత్యవతి అనారోగ్యం కారణంగా రాజమహేంద్రవరం రూరల్ పిడింగొయ్యి గ్రామంలో ఆమె బంధువుల ఇంటికి వెళ్లింది. పింఛన్ల పంపిణీ గడువు పూర్తవుతున్నా లబ్ధిదారు ఇంట్లో లేకపోవడంతో విషయం తెలుసుకున్న సచివాలయ వెల్ఫేర్ కార్యదర్శి జోగారావు, ఆ వార్డు కౌన్సిలర్ స్వయంభారపు వీరభద్రరావుతో కలసి పిడింగొయ్యికి వెళ్లి సత్యవతికి పింఛను సొమ్ము అందజేశారు.

పోస్టర్ల ఆవిష్కరణ

సామర్లకోట: శ్రీకాకుళం జిల్లా రణస్థలంలో 12న జనసేన అధ్యక్షుడు పవన్‌కల్యాణ్ నిర్వహించే యువశక్తి బహిరంగ సభను జయప్రదం చేయాలని ఆ పార్టీ నియోజకవర్గ కన్వీనర్ తుమ్మల బాబు పిలుపునిచ్చారు. ఈ మేరకు శుక్రవారం స్థానిక గణపతినగరం వాటర్ ట్యాంకుల వద్ద బహిరంగ సభ పోస్టర్లు ఆవిష్కరించారు.

బెల్టు దుకాణాలు తొలగించండి

కొత్తపల్లి: మండలంలో ఎక్కడ చూసినా కిళ్లీ షాపుల్లోనూ, చిన్న చిన్న హోటళ్లలోనూ బెల్ట్ షాపులు నిర్వహిస్తున్నారు. మండలంలో ఉప్పాడ, వాకతిప్ప, కొండెవరం, మూలపేటతో పాటు పలు గ్రామాల్లో, గుడి, బడి అనే తేడ లేకుండా సుమారు 50కు పైగా బెల్ట్ షాపుల్లో మద్యాన్ని విక్రయిస్తున్నారు. ముఖ్యంగా కొత్తపల్లి, కొమరగిరి, గోర్స, కొండెవరం, కోనపాపపేట, ఇసుకపల్లితో పాటు పలు శివారు గ్రామాల్లో సైతం బెల్ట్ షాపులను నిర్వహించడంపై మహిళలు ఆవేదన చెందుతున్నారు.

పందేలు నిర్వహిస్తే కఠిన చర్యలు

కొత్తపల్లి: కోడిపందేలు నిర్వహిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని ఎస్సై రామలింగేశ్వరరావు అన్నారు. శుక్రవారం ఆయన మాట్లాడుతూ సంక్రాంతి సందర్భంగా గ్రామాల్లో జూదాలు నిర్వహిస్తే చట్ట ప్రకారం చర్యలు ఉంటాయన్నారు. కోడి కత్తులు తయారు చేసినా, కత్తులు కట్టినా రౌడీషీట్ తెరుస్తామన్నారు.

అర్హులందరికీ సంక్షేమ పథకాలు

- హౌసింగ్ కార్పొరేషన్ చైర్మన్ దొరబాబు
- వెల్ఫేర్ అసిస్టెంట్ పనితీరుపై కలెక్టర్‌కు ఫిర్యాదు



పీబీ దేవంలో లబ్ధిదారులకు పథకాల గురించి వివరిస్తున్న దవులూరి దొరబాబు

సామర్లకోట: అర్హులందరికీ ప్రభుత్వం సంక్షేమ పథకాలను అందిస్తుందని రాష్ట్ర హౌసింగ్ కార్పొరేషన్ చైర్మన్ దవులూరి దొరబాబు అన్నారు. శుక్రవారం పీబీ దేవం గ్రామంలో ఎంపీటీసీ సభ్యుడు మలకల సూరిబాబు, సొసైటీ అధ్యక్షుడు మలకల వరహాలబాబు, సర్పంచ్ నీలపాల సత్యనారాయణ, ఉప సర్పంచ్ మలకల సత్యలతో కలసి గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమాన్ని నిర్వహించారు. రెండో సచివాలయ పరిధిలో పర్యటిస్తున్న సమయంలో వెల్ఫేర్ అసిస్టెంట్ పని తీరుపై ప్రజలు ఫిర్యాదులు చేశారు. నెలలో 15 రోజుల పాటు విధులకు గైర్హాజరు కావడంతో పాటు సంక్షేమ పథకాలు అర్హులకు అందకుండా చేస్తున్నారని ఆరోపించారు. ఈ ఫిర్యాదులను కలెక్టర్‌కు దొరబాబు ఫోన్‌లో వివరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గడప గడపకూ తిరిగి ప్రజల సమస్యలను పరిష్కరిస్తున్నామన్నారు. సంక్షేమ పథకాలను అమలు చేస్తున్న జగన్‌మోహన్‌రెడ్డిని తిరిగి ముఖ్యమంత్రిని చేసేందుకు ప్రజలంతా అండగా ఉండాలని ఆయన కోరారు. ఉదయమే ఇంటికి వచ్చి పింఛన్లు అందిస్తుండడంతో లబ్ధిదారులు సంతోషం వ్యక్తం చేశారు. ఎంపీపీ బొబ్బరాడ సత్తిబాబు, కౌన్సిలర్లు నేతల హరిబాబు, గుబ్బల సత్యనారాయణ, మండల పార్టీ అధ్యక్షుడు తాటికొండ అచ్చిరాజు, హుస్సేన్‌పురం ఉప సర్పంచ్ యవర్న చంద్రశేఖర్, రెడ్నం దొరబాబు, పెండ్యాల అబ్బు, రాజబాబు పాల్గొన్నారు.

సమస్యలు పరిష్కరించడానికే..

- గడప గడపకూ కార్యక్రమంలో ఎమ్మెల్యే పెండెం దొరబాబు



లబ్ధిదారుడికి పథకాలు వివరిస్తున్న ఎమ్మెల్యే దొరబాబు

పిఠాపురం: ప్రతి ఇంట్లో, ప్రతి కాలనీలో, ప్రతి గ్రామంలో ఏదో ఒక సమస్య ఉంటుంది. చెప్పినా చేసే వారుండరు. అలాంటి సమస్యలు తెలుసుకోడానికే గడపగడపకు మన ప్రభుత్వం నిర్వహిస్తున్నామని ఎమ్మెల్యే పెండెం దొరబాబు అన్నారు. శుక్రవారం పిఠాపురం 8వ వార్డు సచివాలయ పరిధి డ్రైవర్స్ కాలనీలో గడపగడపకు మన ప్రభుత్వం నిర్వహించారు. కాలనీలో డ్రైన్లకు అవుట్‌లెట్ లేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నట్లు స్థానికులు ఆయనకు వివరించగా మున్సిపల్ చైర్ పర్సన్, అధికారులతో సమీక్షించి అవసరమైతే నిధులు కేటాయించి త్వరలోనే పరిష్కరిస్తామని ఆయన హామీ ఇచ్చారు. ఈ మేరకు పనిపై నివేదిక ఇవ్వాలని అధికారులను ఆదేశించారు. ఇలా పలు సమస్యలపై అధికారులకు ఆదేశాలు ఇచ్చారు. కార్యక్రమంలో వార్డు కౌన్సిలర్లు బోనాసుల శివ, తలిశెట్టి వెంకటేశ్వరరావు, మతం లోవరాజు, బోను దేవ, లోవరాజు, పోసయ్య, మున్సిపల్ వైస్ చైర్‌పర్సన్ పచ్చిమళ్ల జ్యోతి. మాజీ చైర్‌పర్సన్ వర్థినీడి సుజాత, వైఎస్సార్‌సీపీ నేతలు గండేపల్లి బాబీ, కొప్పన శివనాథ్, మార్నీడి రంగబాబు, కొత్తపల్లి బుజ్జి, బాలిపిల్లి రాంబాబు, బొజ్జా దొరబాబు, పచ్చిమళ్ల అప్పలరాజు, ఆగంటి ప్రభాకరరావు వార్డు సచివాలయ సిబ్బంది, వలంటీర్లు పాల్గొన్నారు.

నేడు జిల్లా మహిళా సమాఖ్య సమావేశం

సామర్లకోట: కాకినాడ జిల్లా మహిళా సమాఖ్య సమావేశం శనివారం మధ్యాహ్నం 3 గంటలకు జరుగుతుందని డీఆర్‌డీఏ పీడీ కె.శ్రీరమణి ఓ ప్రకటనలో పేర్కొన్నారు. ప్రతి నెలా జిల్లా మహిళా సమాఖ్య సమావేశాలు జరగాల్సి ఉండగా జిల్లా విభజనతో ఆరు నెలలుగా నిర్వహించలేదు. తొలిసారిగా స్థానిక టీటీడీసీలో జరిగే జిల్లా సమావేశానికి కలెక్టర్ కృతికా శుక్లా ముఖ్య అతిథిగా హాజరవుతారని వివరించారు. సమావేశం అనంతరం ఫ్యాషన్ డిజైన్ సెంటర్‌ను కలెక్టర్ ప్రారంభిస్తారని చెప్పారు.

నేడు కాంట్రాక్ట్ కమిటీ సమావేశం

సామర్లకోట: మున్సిపల్ కౌన్సిల్ సభ్యులతో ఏర్పాటు చేసిన కాంట్రాక్ట్ కమిటీ సమావేశం శనివారం ఉదయం జరుగుతుందని మున్సిపల్ కమిషనర్ నయీం అహ్మద్ తెలిపారు. మున్సిపల్ చైర్‌పర్సన్ చాంబర్‌లో జరిగే ఈ సమావేశానికి చైర్‌పర్సన్ అధ్యక్షత వహిస్తారని, కమిటీ సభ్యులు, ఇంజినీరింగ్ శాఖాధికారులు హాజరు కావాలన్నారు.

రేపు సంక్రాంతి పోటీలు

సామర్లకోట: స్థానిక 31వ వార్డు దుర్గమ్మ గుడి వద్ద ఆదివారం పట్టణ స్థాయి సంక్రాంతి పోటీలు నిర్వహిస్తున్నట్లు ఆ వార్డు కౌన్సిలర్ పాగా సురేష్‌కుమార్ తెలిపారు. 16 ఏళ్లుగా నిర్వహిస్తున్న సంక్రాంతి సంబరాల్లో భాగంగా సంప్రదాయ భోగి మంటలు, వంటలు, ముగ్గులు, ట్యాలెంట్ గేమ్స్, కబడ్డీ, డ్రాయింగ్ పోటీలు జరుగుతాయన్నారు. విజేతలకు ఎంపీ వంగా గీత, మున్సిపల్ కోఆప్షన్ సభ్యుడు దవులూరి సుబ్బారావు, పెద్దాపురం డీఎస్పీ సుంకర మురళీ మోహన్ చేతుల మీదుగా బహుమతుల ప్రదానం జరుగుతుందన్నారు.

వసతి గృహాల్లో మెరుగైన సౌకర్యాలు



ఆనంద నిలయాన్ని పరిశీలిస్తున్న కలెక్టర్ కృతికా శుక్లా

జిల్లా కలెక్టర్ కృత్తికా శుక్లా

పెద్దాపురం: స్థానిక బీసీ, ఎస్సీ సంక్షేమ వసతి గృహాలను శుక్రవారం కలెక్టర్ కృత్తికా శుక్లా ఆకస్మికంగా తనిఖీ చేశారు. రామారావుపేట బీసీ బాలికల వసతి గృహం, వరహాలయ్యపేట ఆనంద నిలయంలో విద్యార్థులకు అందుతున్న సేవలపై ఆరా తీశారు. అక్కడ అరకొర వసతులు, సరైన మరుగు లేకపోవడంతో సంబంధిత అధికారులపై మండిపడ్డారు. బాలికలకు అవసరమైన మౌలిక వసతులు ఏర్పాటు చేయాలని సూచించారు. వేడి నీళ్లకు అవసరమైన గ్రీజర్, బెడ్స్, వంటి అవసరాలపై విద్యార్థినులు కలెక్టర్ దృష్టికి తీసుకువచ్చారు. సత్వరమే వాటి ఏర్పాటుకు చర్యలు చేపడతానని ఆమె హామీ ఇచ్చారు. స్థానిక లలితా రైస్ ఇండస్ట్రీస్ యాజమాన్యం ద్వారా విద్యార్థులకు అవసరమైన వసతుల ఏర్పాటుకు చర్యలు చేపడతానని కలెక్టర్ తెలిపారు. అనంతరం ఆమె స్థానిక విలేకర్లతో మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం విద్యకు అధిక ప్రాధాన్యం ఇస్తుందన్నారు. నాడు–నేడు పథకం కింద అన్ని వసతులు కల్పిస్తుందన్నారు. సంక్షేమ వసతి గృహాల ద్వారా మెరుగైన విద్య అందుతుందని తెలిపారు. ఆమె వెంట మున్సిపల్ చైర్ పర్సన్ బొడ్డు తులసీ మంగతాయారు, తహసీల్దార్ జితేంద్ర, కమిషనర్ జంపా సురేంద్ర, సాంఘిక సంక్షేమ శాఖ జేడీ రంగలక్ష్మిదేవి, బీసీ సంక్షేమశాఖ జిల్లా అధికారి మయూరి, ఈఈ లక్ష్మణరెడ్డి, బీసీ, ఎస్సీ సంక్షేమ శాఖాధికారులు ఉన్నారు.

పంచారామంలో ఆరుద్ర నక్షత్ర పూజలు



పంచారామ క్షేత్రంలో స్వామివారికి అభిషేకాలు చేస్తున్న అర్చకులు

సామర్లకోట: స్థానిక పంచారామ క్షేత్రమైన బాలా త్రిపుర సుందరీ సమేత కుమారారామ భీమేశ్వర స్వామి ఆలయంలో శుక్రవారం స్వామివారి జన్మ నక్షత్రం ఆరుద్ర పూజలు జరిగాయి. తెల్లవారు జామున స్వామివారికి ఈఓ డి.నాగమల్లేశ్వరరావు ఆధ్వర్యంలో పండితులు అభిషేకాలు నిర్వహించారు. అనంతరం పిఠాపురం మహారాజా గోత్రనామాలతో తొలి పూజ చేశారు. అమ్మవారికి కుంకుమార్చనలు జరిగాయి. ఆలయంలో మూలవిరాట్‌తో పాటు ఉప ఆలయాల్లో పూజలు నిర్వహించారు. పూజల అనంతరం భీమేశ్వరస్వామి, బాలా త్రిపుర సుందరీదేవి అమ్మవారిని ప్రత్యేకంగా అలంకరించారు. ఆలయానికి వచ్చిన భక్తులకు ఉదయం నుంచి అన్న ప్రసాదం ఏర్పాటు చేశారు. ఆలయ ట్రస్టు బోర్డు సభ్యులు యండమూరి వెంకటసుబ్బారావు, చందలాడ వెంకట్రావు, కర్రి వెంకటలక్ష్మి, చల్లా కుమారి, నేతల వెంకటలక్ష్మి, కౌన్సిలర్ నేతల హరిబాబు, ఆలయ సిబ్బంది భక్తులకు సేవలందించారు.

ఉత్తర ద్వార దర్శనం

పిఠాపురం: పిఠాపురం పాదగయ క్షేత్రంలో కొలువై ఉన్న రాజరాజేశ్వరి సమేత కుక్కుటేశ్వరస్వామి ఆలయంలో శుక్రవారం శివ ముక్కోటి సందర్భంగా భక్తులకు ఉత్తర ద్వార దర్శనం కల్పించారు. అంతరాలయం చుట్టూ ఉత్సవ మూర్తులతో ప్రదక్షిణ చేశారు. పలువురు భక్తులు స్వామిని దర్శించుకుని తీర్థ ప్రసాదాలు స్వీకరించారు. ఆలయ ట్రస్టుబోర్డు చైర్మన్ ఆగంటి ప్రభాకరరావు, ఆలయ ఈఓ సౌజన్య, పలువురు భక్తులు పాల్గొన్నారు.

అపర్ణాదేవికి పుష్య పౌర్ణమి పూజలు

గొల్లప్రోలు మండలం తాటిపర్తిలో వేంచేసియున్న అపర్ణాదేవికి శుక్రవారం పుష్య పౌర్ణమి పూజలు నిర్వహించారు. ఆలయ అర్చకులు ఆకొండి ప్రభాకరశాస్త్రి ఆధ్వర్యంలో అమ్మవారికి ప్రత్యేక పంచామృత సుగంధ ద్రవ్యాలతో అభిషేకాలు నిర్వహించారు. భక్తులు అమ్మవారిని దర్శించుకుని తీర్థ ప్రసాదాలు స్వీకరించారు.

వైభవంగా శివ ముక్కోటి పూజలు

గొల్లప్రోలు మండలం దుర్గాడలోని ఉమా రామ లింగేశ్వరునికి శుక్రవారం శివ ముక్కోటి సందర్భంగా విశేషపూజలు చేశారు. ఆలయ అర్చకులు చెరుకూరి వీరబాబు, దత్తు సోదరులు అభిషేకాలు నిర్వహించారు. లలితా మాతకు పంచామృతాభిషేకాలు నిర్వహించగా పలువురు మహిళలు కుంకుమ పూజలు చేశారు.



ప్రత్యేక అలంకరణలో అపర్ణాదేవి అమ్మవారు



లలితా మాతకు ప్రత్యేక పూజలు చేస్తున్న మహిళలు



పాదగయ క్షేత్రంలో ఆలయ ప్రదక్షిణ చేస్తున్న సిబ్బంది

గోకివాడను ఆదర్శ గ్రామంగా తీర్చిదిద్దాలి

ఎమ్మెల్యే పెండెం దొరబాబు



సీసీ రోడ్డు నిర్మాణానికి శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే పెండెం దొరబాబు

పిఠాపురం: గోకివాడ గ్రామాన్ని ఆదర్శ గ్రామంగా తీర్చిదిద్దుతామని ఎమ్మెల్యే పెండెం దొరబాబు తెలిపారు. శుక్రవారం ఆయన గ్రామంలో పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేశారు. జల్‌జీవన్ మిషన్ ద్వారా ఇంటింటికీ కుళాయి నిర్మాణ పనులు, శ్మశాన వాటిక అభివృద్ధి పనులు, సీసీ రోడ్లు గ్రావెల్ రోడ్లు, చెత్త నుంచి సంపద తయారీ కేంద్రం నిర్మాణ పనులకు శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతు గ్రామాల్లో అన్ని రకాల మౌలిక సదుపాయాల కల్పించడానికే ప్రాధాన్యం ఇస్తున్నామన్నారు. కార్యక్రమంలో జెడ్పీ వైస్ చైర్మన్ బుర్రా అనుబాబు, ఎంపీపీ కన్నాబత్తుల కామేశ్వరరావు, సర్పంచ్ కీర్తి హరనాథ్‌బాబు, ఎంపీటీసీ వేమగిరి చిన నాగరాజు, పలువురు వైఎస్సార్ సీపీ నేతలు, అధికారులు పాల్గొన్నారు.



పూతతో కళకళలాడుతున్న మామిడి చెట్టు

విరగబూసిన మామిడి పూత

కొత్తపల్లి: విరగబూసిన మామిడి పూత రైతుల్లో కొత్త ఆశలు చిగురింపజేస్తున్నాయి. ఈ ఏడాది వాతావరణ అనుకూలించే పరిస్థితులు కనిపించడంతో రైతులు పూతను కాపాడుకునేందుకు అనేక క్రిమి సంహారకాలను వెదజల్లుతున్నారు. ప్రస్తుతం పూతపై మంచు ప్రభావం పడకుండా ముందస్తు జాగ్రత్త చర్యలు తీసుకొంటున్నారు. ఈ ఏడాది దిగుబడి ఆశాజనకంగానే ఉండవచ్చని రైతులు అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు.

పగలే వెలుగులు

కొత్తపల్లి: రాత్రి సమయాల్లో వెలగవలసిన వీధి దీపాలు యండపల్లిలో పగలే వెలుగుతున్నాయి. ప్రతి రోజూ ఇదే పరిస్థితి అని స్థానికులు అంటున్నారు. సంబంధిత అధికారులు స్పందించి వీధి దీపాల నిర్వహణపై దృష్టి పెట్టాలని ప్రజలు కోరుతున్నారు.



యండపల్లిలో పట్టపగలే వెలుగుతున్న వీధి దీపాలు

శిక్షణను సద్వినియోగం చేసుకోండి



శిక్షణ పూర్తి చేసుకున్న ఉద్యోగులకు సర్టిఫికెట్లు అందజేస్తున్న అసిస్టెంట్ కమిషనర్ కృష్ణమోహన్

సామర్లకోట: ప్రభుత్వ ఉద్యోగులకు ఇచ్చిన శిక్షణను సద్వినియోగం చేసుకోవాలని పంచాయతీ రాజ్ అసిస్టెంట్ కమిషనర్ ఇ.కృష్ణమోహన్ అన్నారు. స్థానిక విస్తరణ శిక్షణ కేంద్రంలో పూర్వపు ఐదు జిల్లాలైన పశ్చిమ, తూర్పు, విశాఖ, విజయనగరం, శ్రీకాకుళం జిల్లాలకు చెందిన జిల్లా పరిషత్తు, డీపీఓ కార్యాలయాల జూనియర్ అసిస్టెంట్లు, టైపిస్టులకు నాలుగు రోజుల పాటు నిర్వహించిన శిక్షణ ముగిసింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కాండక్టు రూల్స్, సీసీఏ రూల్స్‌పై శిక్షణ ఇచ్చారన్నారు. జూనియర్ అసిస్టెంట్లు, టైపిస్టులు ఇతర ఉద్యోగులకు ఇంక్రిమెంట్లు, పెన్షన్ వంటి ప్రతిపాదనలు తయారు చేయడానికి శిక్షణ ఎంతగానో దోహదపడుతుందన్నారు. శిక్షణ పొందిన వారు ప్రభుత్వ జీఓలపై అవగాహన కలిగి ఉండాలన్నారు. ఈటీసీ ఫ్యాకల్టీలు పి.శ్రీనివాసరావు, కె.నిహారిక, వి.ప్రసాద్, వెంకటేశ్వర్లు, ఎస్‌కే మోహీద్దీన్‌లు ముగింపు రోజు శిక్షణ నిర్వహించారు. శిక్షణ పూర్తి చేసుకున్న వారికి ప్రిన్సిపాల్ సర్టిఫికెట్లు అందజేశారు.

పర్యావరణాన్ని పరిరక్షిద్దాం..



అమ్మాణమ్మ అపార్టుమెంట్ వద్ద మొక్కలు నాటిన చైర్‌పర్సన్ అరుణ

సామర్లకోట: పర్యావరణాన్ని పరిరక్షించే బాధ్యతను ప్రతి ఒక్కరూ తీసుకోవాలని మున్సిపల్ చైర్‌పర్సన్ గంగిరెడ్డి అరుణ అన్నారు. స్థానిక అమ్మాణమ్మ అపార్ట్‌మెంట్ వదద్ద మొక్కలు నాటే కార్యక్రమాన్ని శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ తమ ఇళ్ల వద్ద రెండు మొక్కలు నాటి వాటిని సంరక్షించాలన్నారు. అప్పుడు భవిష్యత్తు తరాలకు ఎలాంటి ఇబ్బంది ఉండదన్నారు. కార్యక్రమంలో కౌన్సిలర్లు రెడ్నం సునీత, గుబ్బల సత్యనారాయణ, సచివాలయ కార్యదర్శులు పాల్గొన్నారు.

పీహెచ్‌సీలో విజిలెన్స్ తనిఖీలు



ఆసుపత్రిలో తనిఖీలు చేస్తున్న విజిలెన్స్ అధికారులు

పెద్దాపురం: కాండ్రకోట పీహెచ్‌సీలో విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు శుక్రవారం ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. విజిలెన్స్ ఎస్పీ రవికుమార్ ఆదేశాల మేరకు సీఐ సత్యకిశోర్, వలీ, డ్రగ్ ఇన్‌స్పెక్టర్ కృష్ణలు ఆసుపత్రిలోని పలు రికార్డులను తనిఖీ చేశారు. రోగులకు అందుతున్న వైద్య సేవలపై ఆరా తీశారు. రికార్డుల నిర్వహణ సక్రమంగా లేకపోవడం, సిబ్బంది తీరుపై అసంతృప్తి వ్యక్తం చేశారు. పలు అంశాలపై నివేదికను ఉన్నతాధికారులకు అందిస్తామని సీఐ తెలిపారు. పీహెచ్‌సీ వైద్యురాలు సీహెచ్ ధనలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

చురుగ్గా వరినాట్లు



మండలంలో సాగుతున్న వరినాట్లు

కొత్తపల్లి : మండలంలో రబీ సాగులో వరినాట్లు జోరుగా సాగుతున్నాయి. మొత్తం సుమారు 10,652 ఎకరాల్లో వరిసాగు చేపట్టాల్సి ఉంది. ఇప్పటి వరకూ 2000 ఎకరాలలో నాట్లు పూర్తయ్యాయి. వీటిలో వెదజల్లు, డ్రమ్ము సీడర్ ద్వారా 400 ఎకరాల్లో, మిగిలిన నాట్లు కూలీల ద్వారా వేశారు. కాలువల ద్వారా సాగునీరు పుష్కలంగా రావడంతో రైతులు వరినాట్లు ముమ్మరం చేశారు. దీంతో కూలీలకు గిరాకీ పెరిగింది. వ్యవసాయశాఖ అధికారుల సూచనలు, సలహాలతో వరి సాగు చేయాలని, తక్కువ ఖర్చుతో అధిక దిగుబడి సాధించవచ్చని వ్యవసాయశాఖ అధికారి జోగిరాజు తెలిపారు. గ్రామాల్లో ఉన్న ఆర్బీకేల్లో ఎరువులు, విత్తనాలు, పురుగుమందులు అందుబాటులో ఉన్నాయన్నారు.

స్తంభాన్ని తొలగించరూ..



పిఠాపురం-కోనపాపపేట మధ్యలో ఉన్న విద్యుత్ స్తంభాలు

కొత్తపల్లి: పిఠాపురం–కోనపాపపేట రహదారి అభివృద్ధి పనుల్లో భాగంగా సిబ్బంది నిర్వాకం, ఆయా శాఖల సమన్వయ లోపం ఇది. రహదారి నిర్మాణంలో ఈ స్తంభాన్ని తొలగించాల్సి ఉన్నప్పటికీ వదిలేయడంతో ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. దీనిపై విద్యుత్ శాఖ ఏఈ ప్రమోదను వివరణ కోరగా స్తంభాల మార్పుకు సంబంధించి ధరావత్తు చెల్లించకపోవడంతో వాటిని తొలగించలేదని పేర్కొన్నారు.